## క్లుప్తంగా

### నిబంధనలు తప్పనిసరి



ర్యాలీలో మాట్లాడుతున్న సీఐ జీడీ బాబు

**సాలూరు:** వాహన చోదకులందరూ తప్పనిసరిగా రహదారి భద్రతా నిబంధనలు పాటించాలని సీఐ జీడీ బాబు అన్నారు. హ్యాపీ డ్రైవర్స్ డే సందర్భంగా స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ భాస్కరరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పోస్టాఫీస్ వరకు సాగిన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, నిబంధనలకు అనుగుణంగా డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలను అరికట్ట వచ్చన్నారు. డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్‌లో మాట్లాడకూడదని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

### బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

- సీఐ జీడీ బాబు



ర్యాలీలో పాల్గొన్న సీఐ జీడీ బాబు, తదితరులు

**సాలూరు:** బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని సీఐ జి.దేముడుబాబు అన్నారు. జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్, స్ఫూర్తి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి పాఠశాల విద్యార్థులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో బాలికలు ఆత్మధైర్యంతో మెలగాలని తెలిపారు. లక్ష్యంతో కూడిన విద్యనభ్యసించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగవచ్చన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సత్యవతి, స్ఫూర్తి మహిళా మండలి డైరెక్టర్ బి.రాధ, పట్టణ ఎస్సై, ఎంఈఓ, అంగన్‌వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### నేడు వైఎస్సార్ ఆసరా సంబరాలు

**గుమ్మలక్ష్మీపురం:** వైఎస్సార్ ఆసరా సంబరాలు గుమ్మలక్ష్మీపురం బీఎస్ఆర్ కళింగ వైశ్య కల్యాణ మండపం వద్ద గురువారం నిర్వహించనున్నట్టు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఆదయ్య బుధవారం తెలిపారు. వైఎస్సార్ ఆసరా నాలుగో విడత గుమ్మలక్ష్మీపురం మండలానికి చెందిన 565 డ్వాక్రా సంఘాల్లోని 6317 సభ్యులకు రూ.2.15 కోట్లను ప్రభుత్వం జమ చేసిందని, ఈ నేపథ్యంలోనే మండల స్థాయిలో వైఎస్సార్ ఆసరా సంబరాలు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి పాల్గొంటారని తెలిపారు.

### పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**కురుపాం:** రాష్ట్ర ప్రభుత్వం పాడి రైతుల కోసం ప్రవేశ పెట్టిన పశు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిణి కె.శైలజ అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ పాడి రైతులు, గొర్రెలు, మేకలు, పందుల పెంపకందారుల కోసం ప్రభుత్వం నూతనంగా (లైవ్ స్టాక్ ఇన్స్యూరెన్స్ స్కీం) పశు బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందన్నారు. గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం స్థానంలో ఈ పథకం నూతనంగా ప్రారంభించిందని లబ్ధిదారుల వాటా వాటా ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులకు 20 శాతం, ఏపీఎల్ లబ్ధిదారులకు 50 శాతంగా నిర్ణయించందన్నారు. వివరాలకు సమీపంలో ఉన్న రైతు భరోసా కేంద్రాలను, పశువైద్య అధికారులను సంప్రదించాలని కోరారు.

### ప్రభుత్వ భవనాలు ప్రారంభం

**పాలకొండ:** మండలంలోని సింగన్నవలస గ్రామంలో రూ.కోటితో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ బుధవారం ప్రారంభించారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, గ్రామీణ వైద్య కేంద్రం, సచివాలయ భవనాలను ప్రభుత్వం మంజూరు చేయగా వాటి నిర్మాణాలు పూర్తయ్యాయి. వీటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కళావతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రభుత్వ సేవలు ప్రజల వద్దకు తీసుకువచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు చేరువ చేయడం ద్వారా మంచి పాలన అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బి.భాను, వైస్ ఎంపీపీలు కనపాక సూర్యప్రకాష్‌రావు, వాకముడి అనిల్‌కుమార్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

### రుణ వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ

**భామిని:** మహిళా సంఘాలకు ఇచ్చిన స్త్రీనిధి, ఉన్నతి, సీఎంఎఫ్ నిధుల రుణ వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ సారించాలని వెలుగు ఏపీఎం దొడ్ల భవానీ కోరారు. వెలుగు కార్యాలయంలో సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో రుణాలపై సమీక్షించారు. ఇటీవల ప్రభుత్వం మంజూరు చేసిన సున్నా వడ్డీ నిధులు, ఆసరా నిధులు, మహిళా సంఘాల సభ్యుల ఖాతాలకు జమ కానున్నాయన్నారు. సీసీలు, సీఓలు, వీఓఏలు ఉన్నారు.

# కులగణన సర్వే వేగవంతం చేయాలి



నారాయణపురంలో సిబ్బందితో మాట్లాడుతున్న అధికారులు

**బలిజిపేట:** కులగణన సర్వేను వేగవంతం చేయాలని ఎంపీడీఓ విజయలక్ష్మి సూచించారు. బలిజిపేట మండలంలోని నారాయణపురం, పెద్దిపేంటలలో కులగణన సర్వేను ఎంపీడీఓ విజయలక్ష్మి, ప్రత్యేకాధికారి ఎంఈఓ-1సామల సింహాచలం బుధవారం పర్యవేక్షించారు. సర్వేలో ఉండే అంశాలను కచ్చితంగా సేకరించి అప్‌లోడ్ చేయాలని ఈ సందర్భంగా సర్వే సిబ్బందికి సూచించారు. ఎవరినీ విడిచిపెట్టకుండా అందరినీ సర్వే చేయాలని, సర్వే పక్కాగా ఉండాలని కోరారు. అలాగే వికసిత్ సంకల్పయాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాలపై గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీల కార్యదర్శులు, సిబ్బంది, వలంటీర్లు, రైతులు పాల్గొన్నారు.

### కులగణన గడువులోగా పూర్తిచేయాలి

**సీతానగరం:** మండలంలోని గ్రామాల్లో జరుగుతున్న కులగణన నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండలంలోని పెదభోగిలి 1,2 సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు చేస్తున్న కులగణన కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వర్గాలు ఆర్థికాభివృద్ధి చెందాల్సి ఉందన్నారు. ప్రభుత్వం ఆర్థిక వనరులు సమకూర్చడానికి కేటాయింపుల్లో తేడాలను గుర్తించడానికి కులగణన ముఖ్య అవసరమని చెప్పారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పర్యవేక్షణలో జరుగుతున్న కులగణన కోసం ఇంటింటికీ వస్తున్న సచివాలయ ఉద్యోగులకు గ్రామ వలంటీర్లు, ప్రజలు సహకరించి వారడిగిన సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, ఆయా పంచాయతీల కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్

## సమరానికి సిద్ధం సభను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

**బలిజిపేట:** ఈనెల 27వ తేదీన విశాఖ జిల్లా భీమిలిలో వైఎస్సార్‌సీపీ నిర్వహిస్తున్న సమరానికి సిద్ధం సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే జోగారావు కోరారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ బలిజిపేట కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయం సమీపిస్తుండడంతో ఉత్తరాంధ్రాలో సీఎం జగన్మోహన్ రెడ్డి తొలిసభను నిర్వహిస్తున్నారని తెలిపారు. దీనిని అందరం విజయవంతం చేయాలని అందుకు పార్టీ కేడర్ అంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీని మరింతగా బలోపేతం చేసేదిశగా అందరం పాటుపడాలని కోరారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు నాయకులు వివరించి వారికి ఏ మేరకు మేలు జరిగిందనేది వారు తెలుసుకునే విధంగా తెలియపరచాలని చెప్పారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియకు బూత్ కమిటీల ఎంపిక పూర్తయినందున కమిటీ సభ్యులు కార్యోన్ముఖులై పట్టుదలతో పనిచేసి వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించాలని ఎమ్మెల్యే జోగారావు పిలుపునిచ్చారు. బూత్ కమిటీ, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పి.మురళీకృష్ణ, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, వివిధ గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

### భీమిలి సదస్సుకు సిద్ధం కావాలి

**సీతానగరం:** విశాఖ జిల్లా భీమిలిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 27న జరగనున్న సమావేశాన్ని కార్యకర్తలు, ద్వితీయశ్రేణీ నాయకులు విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు బుధవారం సాయంత్రం సీతానగరం మండలకేంద్రలో పార్టీ మండల అధ్యక్షుడు బి.చిట్టిరాజు అధ్యక్షతన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భీమిలిలో ఈ నెల 27న ఉత్తరాంధ్ర జిల్లాల్లోని నియోజకవర్గాల ద్వితీయ శ్రేణినాయకులు, పార్టీ కార్యకర్తలు స్థానిక సంస్థలప్రజా ప్రతినిధులతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సమావేశమై సార్వత్రిక ఎన్నిల శంఖారావం పూరించనున్నారని తెలిపారు. ఈ మేరకు పార్వతీపురం నియోకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనేలా మండల స్థాయి నాయకులు సిద్ధం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు బి.శ్రీరాములునాయుడు, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి నమూనాల సేకరణ



మట్టినమూనాలు సేకరిస్తున్న ఏఓ, సిబ్బంది

**బలిజిపేట:** భూసార పరీక్షల నిమిత్తం మట్టి నమూనాల సేకరణ జరుగుతున్నట్లు ఏఓ శ్రావణ్‌కుమార్ తెలిపారు. అందులో భాగంగా బలిజిపేట మండలంలోని గలావల్లిలో బుధవారం మట్టి నమూనాలు సేకరించారు. మండలంలో 1178మట్టి నమూనాలు సేకరించనున్నట్లు ఈ సందర్భంగా ఆయన చెప్పారు. పల్లం 5ఎకరాలకు ఒక నమూనా, మెట్టు 25ఎకరాలకు ఒక నమూనా తీయనున్నామన్నారు. మట్టి నమూనాలు తీసి వాటి వివరాలను, రైతుల వివరాలను ఎస్‌హెచ్‌సీ యాప్‌లో నమోదు చేస్తామని తెలిపారు. భూసార పరీక్షలు సక్రమంగా ఉండాలంటే మట్టి నమూనాలు అవసరమని సూచించారు. మట్టి నమూనా వల్ల నేలలో లభ్యమయ్యే పోషక పదార్థాల లభ్యతను తెలుస్తుందన్నారు. ఏ నేల ఏ పంటకు అనుకూలమనేది గుర్తించవచ్చన్నారు. పంటకు ఎటువంటి పోషకాలు ఇవ్వాలో తెలుస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## సీఎం జగనన్నతోనే సంక్షేమం, అభివృద్ధి

- ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి



కళ్లికోటలో సచివాలయం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి

**కొమరాడ:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతున్నాయని ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అన్నారు. మండలంలోని గుణానపురం, కళ్లికోట గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాలను సర్పంచ్‌లు దత్తి మురళీకృష్ణ, మిరియాలు పద్మావతి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే పుష్పశ్రీవాణికి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా సంక్షేమ ఫలాలు ప్రజలకు గ్రామాల్లోనే గడప చెంతకే చేరుతున్నాయన్నారు. వలంటీర్లు ఇంటికొచ్చి సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని చెప్పారు. గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శమన్నారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతిగా ఘనతకెక్కారన్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి శ్యామల, జెడ్పీటీసీ ద్వారపురెడ్డి లక్ష్మీ, వైస్ ఎంపీపీ సంగిరెడ్డి శరత్‌బాబు, మండల పార్టీ కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దనరావు, నాయకులు కళింగి మల్లేశ్వరరావు, డాక్టర్ శెట్టి మధుసూదనరావు, శివిని పీఏసీఎస్ అధ్యక్షుడు పప్పల గోపాలకృష్ణ వలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## నెలాఖరుకు మూడో విడత భూసర్వే పూర్తి



సర్వే టీమ్‌తో సమీక్ష నిర్వహిస్తున్న డిప్యూటీ సర్వేయర్ ప్రసాద్

**వీరఘట్టం:** పాలకొండ డివిజన్‌లో 52 రెవెన్యూ గ్రామాల్లో జరుగుతున్న మూడో విడత భూసర్వేను ఈ నెలాఖరుకు పూర్తి చేస్తామని డివిజనల్ డిప్యూటీ సర్వేయర్ కె.ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సర్వే బృందంతో బుధవారం సమీక్ష నిర్వహించారు. సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేపడుతున్నామని తెలిపారు. ఇంకా 9 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ చేయాల్సి ఉందన్నారు. ఈ నెలాఖరుకు సర్వేతో పాటు స్టోన్ ప్లాంటేషన్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.

### విద్యార్థి అదృశ్యం



అదృశ్యమైన ఉమా మహేశ్వరరావు

**సీతానగరం:** మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన 9వ తరగతి విద్యార్థి చిటికల ఉమామహేశ్వరరావు అదృశ్యమైనట్లు బుధవారం అందిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలియజేశారు. ఈ మేరకు ఎస్సై మాట్లాడుతూ బొబ్బిలి ఐరిస్ ఉన్నత పాఠశాలలో ఉమామహేశ్వర రావు చదువుతున్నాడు. పండగ సెలవులకు వచ్చి చినభోగిలిలో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం బ్యాగ్‌లో బుక్స్‌వేసుకుని పాఠశాలకు వెళ్లి వస్తానని చెప్పాడు. అయితే మంగళవారం సాయంత్రానికి ఇంటికి చేరకపోవడంతో పాఠశాలకు వెళ్లి విచారణ చేయగా యాజమాన్యం రాలేదని తెలియజేశారు. దీంతో ఉమామహేశ్వరరావు ఎక్కడికి వెళ్లాడోనని బంధువుల ఇళ్లకు ఫోన్‌చేసి వాకబు చేసినా తెలియరాకపోవడంతో కుటుంబసభ్యుడు గంటరమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు. విద్యార్థి ఆచూకీ తెలిస్తే ఫోన్ 9121109457 నంబర్‌కు తెలియజేయాలని కోరారు.

### చినమేరంగి ఎస్ఐగా చిన్నంనాయుడు



**జియ్యమ్మవలస:** చినమేరంగి ఎస్ఐగా చిన్నంనాయుడు బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన విశాఖ జిల్లా పెందుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వచ్చి విధుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సహకారంతో శాంతిభద్రతలు పరిరక్షిస్తానని చెప్పారు. ఇక్కడ ఎస్ఐగా పని చేసిన కళాధర్ జిల్లా కేంద్రంలో సీసీఎస్‌కు బదిలీపై వెళ్లారు.

### శతశాతం హాజరు చూపించాలి

**భామిని:** ఉపాధి హామీ పథకంలో నమోదైన వేతనదారులంతా పనులకు శతశాతం హాజరయ్యేలా చూడాలని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి, ఏపీఓ ఇ.తులసీదాస్ అన్నారు. ఉపాధి హామీ టీఏలు, సీఓలు, ఎఫ్ఏలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జీపీలోనూ విధిగా శతశాతం వేతనదారుల హాజరు వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

### భద్రతకు తొలి ప్రాధాన్యత



రోడ్డు భద్రతా మాసోత్సవాలపై అవగాహన కల్పిస్తున్న ఎంవీఐ వేణుగోపాలరావు

**పాలకొండ రూరల్:** వాహన చోదకులు రోడ్డు ప్రమాదాలు సంభవించకుండా వ్యవహరించాలని, భద్రతకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని మోటారు వెహికల్ అధికారి తంగి వేణుగోపాలరావు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశాల మేరకు పాలకొండ - శ్రీకాకుళం రహదారిలో అవగాహన కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. వాహన చోదకులు పాటించాల్సిన నిబంధనలపై అవగాహన కల్పించారు. అతి వేగం, మద్యం సేవించి, సెల్‌ఫోన్లు మాట్లాడుతూ వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. మైనర్లకు వాహనాలు నడిపేందుకు ఇవ్వరాదని సూచించారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు భేష్



వైద్య శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ప్రత్యేకాధికారి

**పాలకొండ:** జగనన్న ఆరోగ్య సురక్ష సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా నోడల్ అధికారి ఎం.నారాయణరావు తెలిపారు. పట్టణంలోని వెంకమ్మపేట పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష-2 శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఆయన సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇటువంటి మంచి కార్యక్రమాలను చేపడుతుందని వివరించారు. మొత్తం 484 మందికి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది టి.రమేష్ జయగౌడ్, కె.తేజ్ రతన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వికసిత్ భారత్ సంకల్పయాత్రలో క్యాలెండర్ ఆవిష్కరణ



నిడగల్లులో వికసిత్ భారత్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ

**సీతానగరం:** మండలంలోని గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన సీతానగరం మండలంలోని నిడగల్లులో సర్పంచ్ ఆర్.ఆరుద్రమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్పయాత్రలో భాగంగా క్యాలెండర్లను ఆవిష్కరించి ప్రజలకు పంపిణీ చేసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేకించి కేంద్రప్రభుత్వం నిధులతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజలకు పంచాయతీ కార్యదర్శులు వివరించాలని తెలియజేశారు. అనంతరం గ్రామంలో పెదంకలాం పీహెచ్‌సీ డాక్టర్ రాధాకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వికసిత్ భారత్ గ్రామ సభవద్ద జరిగిన వైద్యశిబిరాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి. సూర్యనారాయణ, ఈఓపీఆర్డీ కె.కుమారవర్మ, పంచాయతీ కార్యదర్శి పి. తిరుపతిరావు, సచివాలయ ఉద్యోగులు గ్రామవలంటీర్లు పాల్గొన్నారు.

## కేజీబీవీలో ఘనంగా బాలికల దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ ఎంఎన్ రాణి

**సీతానగరం:** విద్యాలయాల్లో బాలికలు నేర్చుకున్న ప్రతి అక్షరం ఆయుధంగా మల్చుకుని ఉన్నత స్థానం సంపాదించి ప్రగతిపథంలో రాణించాలని పార్వతీపురం మన్యం జిల్లా శిశు సంక్షేమశాఖ పీడీ ఎంఎన్ రాణి కోరారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా సీతానగరం మండలంలోని జోగింపేట కేజీబీవీలో ఎస్ఓ జె.సంధ్య ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా శిశు సంక్షేమ శాఖ పీడీ ఎంఎన్ రాణి మాట్లాడుతూ బాలికల ఆలోచన పదునుగా ఉండాలని, ప్రతి బాలిక తనకు తానే ఒక ఆయుధంగా మారాలని, నేర్చుకున్న ప్రతి అక్షరం ఉన్నత విద్యాస్థానం వైపు వెళ్లే విధంగా మల్చుకోవాలని సూచించారు. ఇప్పటికే విద్య, శాస్త్ర, సాంకేతిక రంగాల్లో విజయ పథం వైపు పయనిస్తున్నారన్నారు. కొంతమంది కాస్త వెనుకబడుతున్న కారణంగా ఇబ్బందులు వస్తున్నాయని చెప్పారు. అన్నిటినీ అధిగమించే శక్తి ఒక్క విద్యకే ఉందన్నారు. విద్యలో రాణించి సమాజానికి సేవలందించే స్థాయికి బాలికలు అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీఓ సత్యనారాయణ, ఎంఈఓ1 జి.సూరిదేముడు, ఎంఈఓ2 ఎంవీరమణ, జీసీడీఓ కె. రోజారాణి, శైలజతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆడపిల్లలకు హక్కులు, స్త్రీ విద్యపై అవగాహన

- డీఎంఓ డాక్టర్ జగన్‌మోహన్‌రావు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎంఓ జగన్‌మోహన్‌రావు

**పార్వతీపురంటౌన్:** హక్కులు, స్త్రీ విద్యపై ఆడపిల్లలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా అధికారి టి.జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో వైద్యారోగ్య శాఖ నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. బాలికల ఆరోగ్యం, ఎదుగుల తదితర అంశాలపై ఈ సందర్భంగా ప్రసంగిస్తూ సామాజిక పురోగతికి, అభివృద్ధికి అన్ని రంగాల్లో ఆడపిల్లల ప్రాధాన్యం చాలా ఆవశ్యకమని, ముఖ్యంగా వారి సంరక్షణ, ఆరోగ్యం, విద్య, హక్కులు, సామాజిక ఎదుగుదల ప్రధానమైనవన్నారు. వాటి సాధికారత కోసం ప్రతి ఒక్కరూ తోడ్పడాలని కోరారు. ఆడ, మగ లింగ నిష్పత్తి అన్ని ప్రాంతాల్లో సమానంగా ఉండాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇందుకు గాను గర్భస్థ పిండ నిర్ధారణ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం అమల్లోకి తీసుకువచ్చిందని చెప్పారు. ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసే దిశగా ఇతర శాఖల సమన్వయంతో వైద్యారోగ్యశాఖ కృషిచేస్తుందని తెలిపారు. ఆడపిల్లల ఆరోగ్యం దృష్ట్యా ముఖ్యంగా కిశోరీ బాలికల్లో రక్తహీనత నివారణకు వైద్యారోగ్యశాఖ ప్రత్యేక శ్రద్ధ దృష్టి సారిస్తుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వైద్యారోగ్య శాఖ నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ చూపిన బాలికలకు ప్రశంసాపత్రాలను, బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పి.వెంకటేశ్వరప్రసాద్, ఆరోగ్యశాఖ డెమోలు వి.సన్యాసిరావు, వై.గోగేశ్వర రెడ్డి, సూపర్‌వైజర్ పుష్ప, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆర్టీసీలో డ్రైవర్స్ డే



డ్రైవర్లకు సూచనలు చేస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు తదితరులు

**పాలకొండ రూరల్:** ఆర్టీసీలో రథసారథులైన డ్రైవర్ల విధులు, సేవలు అభినందనీయమని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ వి.వెంకటేశ్వరావు అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా స్థానిక డిపో ప్రాంగణంలో ప్రత్యేక సమావేశం బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. డీఎం మాట్లాడుతూ ఉత్తమ డ్రైవర్లుగా గుర్తింపు పొందేందుకు క్రమశిక్షణ, వృత్తి పట్ల అంకితభావం అవసరమన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సహాయ మేనేజర్ లక్ష్మణరావు, సహాయ మెకానికల్ ఇంజినీరు రాజు, హెడ్ క్లర్క్ నాయుడు, సెక్యూరిటీ అధికారి రాంబాబు, ఎస్‌డీఐ రాజు, ఏడీసీ కృష్ణమూర్తి, వివిధ సంఘాల నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## శతశాతం ధాన్యం కొనుగోలు



కత్తులకవిటి ఆర్‌బీకేలో ఆఖరి ధాన్యం లోడ్‌ను తరలిస్తున్న సిబ్బంది, రైతులు

**వీరఘట్టం:** మండలంలోని కత్తులకవిటి రైతు భరోసా కేంద్రం పరిధిలో బుధవారంతో శతశాతం ధాన్యం కొనుగోలు పూర్తి కావడంతో ఆఖరి లారీతో ధాన్యం లోడ్ వెళ్లడంతో ఆర్‌బీకే సిబ్బంది కొబ్బరికాయ కొట్టేశారు. మొత్తం 351 మంది రైతుల నుంచి 20,200 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్టు అగ్రికల్చరల్ అసిస్టెంట్ వెలగాడ గుణశేఖర్ తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యంలో ఇంత వరకు 15 వేల క్వింటాళ్లకుగాను రూ.3,27,45,000 ను రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందన్నారు. ఇంకా 60 మంది రైతులకు సంబంధించిన 5200 క్వింటాళ్ల ధాన్యం డబ్బులు రావాల్సి ఉందన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సీజన్ ముగించామన్నారు. ప్రభుత్వ చర్యలతో రైతులు ఎంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టిన ఆర్‌బీకే సిబ్బంది జెడ్పీటీసీ జంపు కన్నతల్లి, ఎంపీటీసీ కొత్తవలస పరిమళ, సర్పంచ్ గేదెల సరోజనమ్మ అభినందించారు.